క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెంకాడ: మండలంలోని చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్, విద్యుత్ లైన్లకు నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సురేష్‌బాబు ఆదివారం ప్రకటనలో తెలిపారు. చింతలవలస, ఏపీఎస్పీ బెటాలియన్, బొడ్డవలస, రఘుమండ, గుండాలపేట, కృష్ణాపురం, వెలంపేట, గెద్దవానిపాలెం, జొన్నాడ, ఆకులపేట, డి.తాళ్లవలస, దువ్వపేట, సత్యనారాయణపురం, చెత్తూరు ఇండస్ట్రియల్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైద్యశిబిరం విజయవంతం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పూసపాటిరేగ: మండలంలోని ఎరుకొండలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. సహాయత హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జి. అప్పలస్వామి, వైద్యులు డింపుల్, ప్రశాంత్, శ్రీకాంత్, ఫాదర్ రెవ చంద్రశేఖర్, సహాయత హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ డైరెక్టర్ శ్రీవిద్య అషిత, మహిళా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి ఎ.పద్మ, తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లిని దర్శించుకున్న జస్టిస్ దుర్గాప్రసాద్



పైడితల్లిని దర్శించుకున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి దుర్గా ప్రసాద్ దంపతులు

విజయనగరం లీగల్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి యు.దుర్గాప్రసాద్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ సుధారాణి జస్టిస్‌కు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వైసీబీ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని వైసీబీ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు ఝాన్సీరాణి, నారాయణమ్మ సూచించారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మానవ అక్రమ రవాణాపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వ్యక్తులను అక్రమంగా రవాణా చేయడం నేరమన్నారు. బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకొని ధైర్యంగా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది రామలక్ష్మి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

గజపతినగరం: మహిళల పట్ల జరుగుతున్న దాడులు, వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై మహిళలంతా ఐక్యంగా పోరాడాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి పిలుపునిచ్చారు. గజపతినగరం నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆదివారం సాయంత్రం బస్సు జాతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని, మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మణిపూర్‌లో మహిళలను అర్ధనగ్నంగా ఊరేగించడం దారుణమన్నారు. ఈ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళల రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.సత్యవతి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమణి, జిల్లా కార్యదర్శి రమణమ్మ, స్థానిక నాయకులు హరికృష్ణవేణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం
- హాజరైన ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు



కొండవెలగాడలో బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో అవినీతికి తావులేకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొండవెలగాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగాఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబుతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారుల సమక్షంలో నేరుగా లబ్ధిదారులతో మమేకమయ్యారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు లబ్ధిదారులతో మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ హయాంలో అవినీతి రహిత పాలన సాగుతోందన్నారు. గతంలో సంక్షేమ పథకాలు వర్తించాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారని.. జన్మభూమి కమిటీలకు లంచం ఇస్తే తప్ప పని జరిగేది కాదని గుర్తు చేశారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దే పథకాలు అందిస్తున్నారని చెప్పారు. కోవిడ్ కష్టకాలంలో ప్రజలు ఇళ్లకే పరిమితమైనప్పటికీ, సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆదుకున్నారని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్సీ పెనుమత్స

అభివృద్ధి, సంక్షేమంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దూసుకుపోతున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను శతశాతం నెరవేర్చడంతో ప్రజల మధ్య ధైర్యంగా తిరగగలుగుతున్నామని చెప్పారు. అనంతరం గ్రామంలో కళావేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, నాయకులు దంతులూరి గిరిబాబు, కర్రోతు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఇతిహాసం, పురాణాలు భిన్నమైన ప్రక్రియలే..



డాక్టర్ పి.రాజశేఖర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం టౌన్: ఇతిహాసం, పురాణం రెండూ భిన్నమైన ప్రక్రియలేనని చోడవరం ఏపీఎస్‌డబ్ల్యూ గురుకుల పాఠశాల విశ్రాంత ప్రాచార్యులు డాక్టర్ పి.రాజశేఖర్ అన్నారు. విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన సాహితీ సదస్సులో ఆయన 'ఇతిహాస పురాణాలు – సమసమాజ స్థాపన' అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం రాజశేఖర్‌ను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో బీఏఎస్ఎన్ఎం కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ కాకరపర్తి మురళీప్రసాద్, విజయభావన ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు, ఎంఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ బి.నారాయణమూర్తి, డాక్టర్ వై. బాబూరావు, కె.మురళీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో సంపూర్ణ అభివృద్ధి



41వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న దృశ్యం

- 41వ డివిజన్‌లో రూ.23 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్

విజయనగరం: నగరంలో గత 30 ఏళ్లలో చూడలేని అభివృద్ధిని.. ఈ నాలుగేళ్లలో మనం చూడగలుగుతున్నామని విజయనగరం నగరపాలక సంస్థ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. నగరంలోని 41వ డివిజన్ కంటోన్మెంట్ ప్రాంతంలో రూ.23 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలు వీధుల మీదుగా ఆయన పర్యటించారు. ఆ మార్గంలో డ్రెయిన్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం.. అందులోనే కుళాయి పైప్‌లైన్లు ఉండడంతో ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. అక్కడ కల్వర్టు నిర్మాణంతో పాటు.. పైప్ లైన్లు మార్చేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ, నగరంలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి ఇచ్చిన మాట ప్రకారం అన్ని డివిజన్లలో ఎక్కడా సమస్యల్లేకుండా చేస్తున్నారని తెలిపారు. మరోమారు ప్రజలంతా ఆయనకు సంపూర్ణ మద్దతు పలకాలని కోరారు. డివిజన్ కార్పొరేటర్ సుంకరి నారాయణ స్వామి (బాబు) మాట్లాడుతూ, ప్రస్తుతం రూ.23 లక్షలతో చేపడుతున్న రోడ్లు, డ్రెయిన్ల పనులు నెల రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, జోనల్ ఇన్‌చార్జ్ దుబే, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా అరికట్టాలి



రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది

విజయనగరం టౌన్: మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్‌కుమార్ పిలుపునిచ్చారు. వరల్డ్ డే ఎగినెస్ట్ ట్రాఫికింగ్ ఇన్ పర్సన్స్‌లో భాగంగా ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణాపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అదేవిధంగా రైళ్లలో విధులు నిర్వహించే ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు నిషేధిత గంజాయి రవాణాపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఎస్సై శ్రీధర్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ మద్దతు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

విజయనగరం ఫూల్‌బాగ్: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగులు ఆగస్టు 10 నుంచి చేపట్టనున్న సమ్మెకు సీఐటీయూ తరఫున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె. సుబ్బరావమ్మ తెలిపారు. ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీఐటీయూ ఆఫీస్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు జి. అప్పలసూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుబ్బరావమ్మ మాట్లాడుతూ, విద్యుత్ ఉద్యోగులకు కొత్త పీఆర్‌సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జె. రమేష్ పటా్నయక్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజనల్ సెక్రటరీ వి. రాములు, మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాస్, విజయనగరం, పార్వతీపురం జిల్లాల సీఐటీయూ ప్రధాన కార్యదర్శులు కె. సురేష్, వై. మన్మధరావు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు వి. లక్ష్మి, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సుధారాణి, ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకుడు డీవీ రమణ, గ్రామిక మహిళా సంఘ జిల్లా కన్వీనర్ వి. ఇందిర, తదితరులుపాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ

విజయనగరం ఫూల్ బాగ్: ఉద్యోగోన్నతి పొందిన, బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షుడు డి. ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటరమణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. అలాగే జీఓ 117 రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ. సదాశివరావు, వై. మధుసూధనరావు, ఏవీ రమణ, ఏవీ శ్రీనివాసరావు, జి. సత్యనారాయణ, పి. దామోధరనాయుడు, వి.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు



వసతిగృహ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: విద్యా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతీబా పూలే బీసీ గురుకుల మత్స్యకార పాఠశాల వసతిగృహాన్ని ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావుతో కలిసి విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, గడిచిన నాలుగేళ్లలో విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. నాడు – నేడు పథకం ద్వారా కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారని చెప్పారు. పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థీ చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో అమ్మఒడి సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. వసతిగృహాల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుపడ్డాయని, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని చెప్పారు. అనంతరం విద్యార్థులు పలు సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకురాగా.. పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ, బాలల హక్కులకు భంగం వాటిల్లకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ పిన్నింటి సీతారాం, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి క్షీరాభిషేకం



అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో అర్చకులు అమ్మవారికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సింహాద్రి అప్పన్న సన్నిధిలో మజ్జి దంపతులు



సింహాద్రి అప్పన్న సన్నిధిలో జెడ్పీ చైర్మన్ కుటుంబం

విజయనగరం: సింహాచలంలో వేంచేసిన వరాహ లక్ష్మీ నరసింహస్వామిని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పుష్పాంజలి ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు, అధికారులు మజ్జి కుటుంబ సభ్యులను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు.

బస్టాపుల్లో ఆటోల హవా



గజపతినగరం గణేష్‌కోవెల వద్ద నిలిపి ఉన్న ఆటోలు

గజపతినగరం రూరల్: ఆర్టీసీ బస్సులు నిలుపుదల చేసే చోట ప్రైవేటు వాహనాలు నిలుపరాదనే నిబంధనను అధికారులు గాలికొదిలేశారు. గజపతినగరం మండల కేంద్రంలో ఆర్టీసీ బస్సులు నిలిపే ప్రాంతాల్లో ఆటోలు, టాటా మ్యాజిక్ వాహనాల హవా అధికంగా కనిపిస్తోంది. పార్వతీపురం నుంచి విజయనగరం మీదుగా విశాఖ వెళ్లే బస్సులు ఆపే స్థలంలో ప్రైవేటు వాహనాల నిలుపదల చేయడంతో ఆయా ప్రాంతాల్లో బస్సులు ఆగకుండా వెళ్లిపోతున్నాయి. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆర్టీసీ ఆదాయానికి గండికొట్టేలా ప్రైవేటు వాహనదారులు వ్యవహరిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రయాణికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.1.50 కోట్లతో రహదారి పునరుద్ధరణ పనులు



వెంకమ్మపేట నుంచి సాలిపేట మీదుగా కంటుభుక్తవలస వరకు చేపట్టిన రహదారి పనులు

గజపతినగరం: మండల పరిధిలో రహదారుల అభివృద్ధి, విస్తరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి వెంకమ్మపేట గ్రామం వరకు 2 కిలోమీటర్లు, అక్కడ నుంచి సాలిపేట గ్రామం మీదుగా కంటుభుక్తవలస వరకు రెండున్నర కిలోమీటర్లు మేర రహదారి పునరుద్ధరణ పనులను రూ.1.50 కోట్లతో యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఇటీవల సాలిపేట గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గంట్యాడ కళావతి, గ్రామ పెద్దలు రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. ఆయన వెంటనే స్పందించి ఏఎంసీ నిధుల నుంచి రూ.1.50 కోట్లు మంజూరు చేశారు. ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి వెంకమ్మపేట వరకు రూ.70 లక్షలు, వెంకమ్మపేట నుంచి సాలిపేట మీదుగా కంటుభుక్తవలస వరకు రూ.80 లక్షలతో రహదారి పునరుద్ధరణ పనులు చేపడుతున్నట్లు పంచాయతీరాజ్ డీఈ అప్పలనాయుడు తెలిపారు. ఈ పనులు పూర్తయితే గజపతినగరం, మెంటాడ మండల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది.